# సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం, 12, మే, 2025




**ఇప్పట్లో లేనట్లే..**
జాతీయ రహదారులపై శాటిలైట్ టోల్ వసూల్ విధానం అమల్లోకి రావడానికి సమయం పట్టే అవకాశం ఉంది. - 8లో



**వన మహోత్సవానికి సన్నద్ధం**
వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో ఐదు వేల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేశారు. - 9లో

గరిష్ఠం/కనిష్ఠం
41°/26°

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రేపు పాలిసెట్

భువనగిరి, యాదగిరిగుట్ట : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గానూ ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న పాలిసెట్-2025కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరు కేంద్రాల్లో 1,754 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30వరకు పరీక్ష జరగనుంది. పరీక్షల నిర్వహణకు ఆరుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఆరుగురు పర్యవేక్షకులను నియమించారు.

**కేంద్రాలు ఇవీ..**
భువనగిరిలో జాగృతి డిగ్రీ కళాశాల, శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, యాదగిరిగుట్టలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**నిమిషం నిబంధన**
పాలిసెట్ రాసే అభ్యర్థులు ముందస్తుగానే కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష నిర్దేశిత సమయం 11 గంటల దాటి నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

**వీటిని అనుమతించరు**
గడియారాలు, ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోని అనుమతించరు. అలాగే షూ ధరించవద్దు. హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకోవాలి. పెన్సిల్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్ను తెచ్చుకోవాలి.

### నేడు 2 వేల శివలింగాలకు రుద్రాభిషేకం

భువనగిరి : లోక కల్యాణార్థం, భారత సైనికుల రక్షణ కోసం సోమవారం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి పరిధిలోని రమణేశ్వరంలో రెండు వేల శివలింగాలకు,1008 శ్రీ చక్రాలకు రుద్రహవనం, రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు జగద్గురు శ్రీ రమణానంద మహర్షి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. వివరాల కోసం సెల్ నంబర్ 70932 66255, 96183 61584ను సంప్రదించాలని కోరారు.

# బడిబాట పట్టేలా..!

## విద్యార్థుల నమోదు పెంపునకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ



వలిగొండ మండలం పహిల్వాన్‌పురంలో వేసవి సెలవులకు ముందు నిర్వహించిన బడిబాట..



ఎం.తుర్కపల్లిలో ప్రత్యేక బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- వేసవిలో ప్రతి శుక్రవారం ప్రత్యేక బడిబాట, జూన్ 6నుంచి మరోసారి..
- గ్రామసభల నిర్వహణ
- ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేలా గ్రామస్తులతో తీర్మానం
- పదో తరగతి ఫలితాలు, సర్కారు స్కూళ్లలో సౌకర్యాలపై విస్తృత ప్రచారం

భువనగిరి : సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. వేసవి సెలవులకు ముందే బడిబాట చేపట్టగా.. ఈనెల 9నుంచి ప్రతి శుక్రవారం ప్రత్యేక బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జూన్ 6వ తేదీ నుంచి మరోసారి బడిబాట నిర్వహించనున్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు గ్రామసభలు నిర్వహిస్తూ ప్రభుత్వ బడులపై ప్రజల్లో నమ్మకం పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

**ప్రత్యేక బడిబాట ఉద్దేశం**
వేసవిలో ప్రతి శుక్రవారం మాత్రమే ప్రత్యేక బడిబాట నిర్వహించనున్నారు. ఈనెల 9,16,22,30 తేదీల్లో ప్రత్యేక బడిబాట షెడ్యూల్ రూపొందించి అమలు చేస్తున్నారు. ఎంఈఓలు, హెచ్ఎంలు బడి బయట ఉన్న పిల్లలను, వారి తల్లిదండ్రులను కలవాలి. టెన్త్‌లో ఈ ఏడాది నమోదైన ఫలితాలు, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన తీరుపై వివరించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలను భాగస్వాములను చేయాలి.

**జూన్ 6నుంచి 12వరకు కార్యక్రమాలు ఇవీ..**
2025-26 విద్యా సంవత్సరానికి గాను జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు మరోసారి బడిబాట నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ఈనెల 8న ఆదేశాలు జారీ చేసింది.

- మొదటి రోజు 6న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.
- 7న జిల్లా ప్రత్యేక అధికారి నియామకం చేస్తారు.
- విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు 8,9,10 తేదీల్లో ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి బడిబటయ పిల్లలను గుర్తిస్తారు.
- పాఠశాలల పునఃప్రారంభం రోజు జూన్12న ఉపాధ్యాయులు మరోసారి తల్లిదండ్రులతో సమావేశం కానున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించనున్నారు.

### 715 పాఠశాలలు

యాదాద్రి జిల్లాలో 715 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక 484, ప్రాథమికోన్నత 68, జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలు 163 ఉన్నాయి. వీటిలో 35,558 మంది విద్యార్థులు ఉన్నారు. గత ఏడాది సుమారు 1,254 మంది బడిబయట చిన్నారులను బడిబాట కార్యక్రమంలో గుర్తించారు. వారందరినీ బడిలో చేర్పించారు.

### పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్చేలా గ్రామసభల్లో తీర్మానం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ స్కూళ్ల ఉత్తమ ఫలితాలు సాధించిన నేపథ్యంలో దీనిపై విస్తృత ప్రచారం చేయాలని, తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెంచాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో ఉపాధ్యాయులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని గ్రామస్తులతో తీర్మానం చేయిస్తున్నారు. కర పత్రాలు, బ్యానర్లు, సర్కారు స్కూళ్లలో చదవడం వల్ల ఉపయోగాలు, మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, నిపుణులైన ఉపాధ్యాయులు, ఆటలు, సైన్స్ ల్యాబ్‌లు, ఆధునిక ప్రయోగాలు.. ఇలా అన్ని విషయాలను ప్రజలకు వివరిస్తున్నారు.



రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామస్తులతో సమావేశమైన ఉపాధ్యాయులు

### ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం. అందులో భాగంగా ఇప్పటికే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. తాజాగా ప్రతి శుక్రవారం బడిబాట నిర్వహిస్తున్నాం. జూన్ 6నుంచి మరోసారి బడిబాట కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నాం. ఈసారి పదో తరగతిలో సర్కారు స్కూళ్లు ఉత్తమ ఫలితాలు సాధించాయి. దీంతో పాటు ప్రభుత్వ స్కూళ్లలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఇక్కడ చదవడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక బడిబాట కార్యక్రమంలో వివరిస్తున్నాం.

–సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి

# నృసింహుడి ఉత్సవాలు పరిసమాప్తం



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



కలశాలకు పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈనెల 9నుంచి జరుగుతున్న శ్రీస్వామివారి జయంతి ఉత్సవాలు ఆదివారం పరిసమాప్తం అయ్యాయి. ఉదయం మహా పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, రాత్రి నృసింహ ఆవిర్భావం వేడుక నిర్వహించి ఉత్సవాలకు అర్చకులు ముగింపు పలికారు. సహస్ర కలశాభిషేకంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు, కలెక్టర్ హనుమంతరావు పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం శ్రీనృసింహ జయంతి, ఆవిర్భావ వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. అనంతరం నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, మంగళ నీరాజన కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. అంతకుముందు ఉదయం నిత్య హవనాలు, మూలమంత్ర జపములు, లక్ష్మీసూక్త, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తిపాల్గొన్నారు. పాతగుట్టలోనూ నృసింహుడి జయంతి ఉత్సవాలు ముగిశాయి.



నృసింహ ఆవిర్భావ ఘట్టాన్ని వివరిస్తున్న అర్చకులు



# సాగర్‌కు సుందరీమణులు

## నేడు బుద్ధవనాన్ని సందర్శించనున్న మిస్ వరల్డ్ పోటీదారులు



విద్యుత్ లైట్ల వెలుగుల్లో నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం

- పటిష్ట ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ
- విజయవిహార్‌లో విడిది.. బుద్ధవనంలో ధ్యానం చేయనున్న సుందరీమణులు
- సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలకనున్న లంబాడా మహిళలు

నాగార్జునసాగర్ : ప్రపంచ సుందరీమణుల పర్యటనకు నాగార్జునసాగర్ ముస్తాబైంది. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీమణుల్లో 30 మంది సోమవారం నాగార్జునసాగర్‌కు రానున్నారు. ఈ సందర్భంగా వారు బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్ నుంచి బయలు దేరుతారు. మార్గమధ్యలో చింతపల్లి సమీపంలోని వెల్లంకి అతిథి గృహం వద్ద కాసేపు ఆగనున్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ చేరుకుంటారు. ఫొటో సెషన్ తర్వాత బుద్ధవనం వెళ్తారు. అక్కడ మహాస్థూపం వద్ద ఫొటో సెషన్ ఉంటుంది. వారికి లంబాడా మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలకనున్నారు. సుందరీమణుల పర్యటన నేపథ్యంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

**మహాస్థూపంలో సుందరీమణుల ధ్యానం**
సుందరీమణులు మహాస్థూపంలోకి ప్రవేశించిన తర్వాత అక్కడి విశేషాలను పురావస్తు శాఖ ప్రతినిధులు వారికి వివరిస్తారు. అక్కడే ప్రపంచ సుందరీమణులు ధ్యానం, తర్వాత ఇక్కడే 25 మంది బౌద్ధ సన్యాసులు బైలికుప్ప మహా బోధి పూజలు నిర్వహిస్తారు. అనంతరం జాతకవనాన్ని సందర్శిస్తారు. బుద్ధవనం ప్రాముఖ్యతను పురావస్తు, టూరిజమ్ ప్రతినిధి శివనాగిరెడ్డి ప్రపంచ సుందరీమణులకు వివరిస్తారు. జాతకవనం సందర్శన అనంతరం బుద్ధ చరితంపై 18 మంది కళాకారులు ఇచ్చే ప్రదర్శనను తిలకిస్తారు. రాత్రి భోజనం అనంతరం తర్వాత తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

**అంతా సిద్ధం**
సుందరీమణుల పర్యటన నేపథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ నాగార్జునసాగర్‌లోని ఆయా ప్రాంతాలను ముస్తాబు చేసింది. బుద్ధవనం చారిత్రక ప్రాధాన్యత ప్రపంచానికి చాటేలా ఏర్పాట్లు చేశారు. సుందరీమణులు సేద దీరేందుకు విజయవిహార్ అతిథి గృహాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. టైల్స్, బెడ్లు, కర్టెన్స్, కుర్చీలు, టేబుల్స్ అన్నీ అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేశారు. బుద్ధవనం, విజయ విహార్ అతిథి గృహాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**ఇక్కడే డిన్నర్..**
సుందరీమణులు నాగార్జునసాగర్‌లోనే డిన్నర్ చేయనున్నారు. వారివారి దేశ సంప్రదాయాల మెనూ ప్రకారం హైదరాబాద్ నుంచే భోజనాలు తీసుకురానున్నారు.

### టూర్ షెడ్యూల్..

- మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్ నుంచి సాగర్‌కు బయలుదేరుతారు.
- 3 గంటలకు వెల్లంకి గెస్ట్‌హౌజ్‌కు చేరుకుని 3.30వరకు అక్కడ సేదదీరుతారు.
- 4.30కి విజయవిహార్‌కు చేరుకుంటారు.
- సాయంత్రం 5 గంటల వరకు విజయ విహార్‌లో ఫ్రెష్ అప్ అవుతారు.
- 5.30 వరకు టీ, ప్రధాన ద్వారం వద్ద ఫొటో షూట్‌లో పాల్గొంటారు.
- 5.45 వరకు విజయవిహార్ నుంచి బుద్ధవనం చేరుకుంటారు. 6 గంటల వరకు అక్కడ ఫొటో సెషన్ ఉంటుంది.
- 6.10కి స్వాగత నృత్యం నడుమ మహాస్థూపం వద్దకు చేరుకుంటారు.
- 6.20 వరకు మహాస్థూపం విశేషాలను గైడెడ్ టూర్ శివనాగిరెడ్డి వారికి వివరిస్తారు.
- 6.30 వరకు బుద్ధశాసన వద్ద ప్రపంచ సుందరీమణుల ధ్యానం చేస్తారు.
- 6.40 నుంచి 6.50 వరకు బుద్ధవనంపై సంక్షిప్త ఉపన్యాసం ఉంటుంది.
- 6.50 నుంచి 7 గంటల వరకు జాతకవనంలో గడుపుతారు.
- రాత్రి 7 నుంచి 7.45 వరకు జాతకవనం వద్ద డిన్నర్ చేస్తారు.
- 7.45 నుంచి 8.45 వరకు వెల్లంకి గెస్ట్‌కు చేరుకుంటారు.
- 9 గంటల వరకు అక్కడ సేదతీరుతారు.
- 11 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

### అంతర్జాతీయ స్థాయిలో భద్రత : నల్లగొండ ఎస్పీ

నాగార్జునసాగర్ : సుందరీమణుల పర్యటనకు అంతర్జాతీయ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. చింతపల్లి సమీపంలోని వెల్లంకి అతిథి గృహం నుంచి నాగార్జునసాగర్ వరకు రహదారి వెంట 2వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని పేర్కొన్నారు. విజయవిహార్, వెల్లంకి గెస్ట్ హౌస్‌తోపాటు బుద్ధవనంలో మూడెంచెల భద్రత ఉంటుందని, అడుగడుగునా నిఘా విభాగాలు కూడా పనిచేస్తాయని పేర్కొన్నారు. సుందరీమణులు పర్యటించే ప్రాంతాలను రెడ్ జోన్‌గా ప్రకటించామని చెప్పారు. ఎల్లో కలర్ పాసులు కలిగిన వారిని మాత్రమే ఈ ప్రాంతంలో అనుమతిస్తామన్నారు. పోలీసులు అధికారులు, ఇతర శాఖల అధికారులకు ఆరెంజ్ కలర్ పాసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రవేశద్వారాల వద్ద విధులు నిర్వర్తించే వారికి, వీఐపీలకు, బయటి వ్యక్తులకు గ్రీన్‌కలర్ పాస్‌లు, మీడియాకు వైట్‌కలర్ పాసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### మద్యానికి బానిసై వ్యక్తి మృతి

**చింతపల్లి:** మద్యానికి బానిసై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చింతపల్లి మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూరు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వీధికి చెందిన దాసరపల్లి లాజర్(51) చింతపల్లి మండల కేంద్రంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ స్థానికంగా ఉంటున్నాడు. రోజు మాదిరిగానే శనివారం కూడా కూలి పనులకు వెళ్లిన లాజర్ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి మద్యం తాగి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున మేస్త్రీ పనికి వెళ్లేందుకు గాను తోటి మేస్త్రీ లాజర్ ఇంటికి వెళ్లి చూడగా అతడు మృతిచెంది ఉన్నాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం లాజర్ మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### ఫాంపాండ్‌లో పడి రిటైర్డ్ టీచర్ దుర్మరణం

**కట్టంగూర్:** వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఫాంపాండ్‌లో పడి రిటైర్డ్ టీచర్ మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం నారెగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారెగూడెం గ్రామానికి చెందిన గంట్ల కరుణాకర్‌రెడ్డి(61) తన వ్యవసాయ బావి వద్ద నీటి నిల్వ కోసం ఫాంపాండ్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన కరుణాకర్‌రెడ్డి రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూడగా.. ఫాంపాండ్‌లో కరుణాకర్‌రెడ్డి మృతదేహం లభించింది. మృతుడి కుమార్తె తేజస్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అఫ్జల్ అలీ తెలిపారు.

### తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

**వలిగొండ:** తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు వట్టిపెల్లి ముత్యాలు ఆదివారం కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. గ్రామస్తులు గమనించి 108 వాహనంలో ముత్యాలును రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**గట్టుప్పల్:** గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో తన ఇంట్లో మృతిచెందాడు. ఆదివారం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్మకన్నె గ్రామానికి చెందిన వల్లాపు మల్లేష్ (37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని మండల కేంద్రంలోని వైన్స్ దగ్గర మద్యం తాగి, అక్కడే ఓ బిర్యాని ప్యాకెట్ పార్సల్ తీసుకొని రాత్రి ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో మంచంపై నిద్రించాడు. అర్ధరాత్రి భార్య లేచి చూడగా.. అప్పటికే మల్లేష్ అపస్మారక స్థితిలో ఉన్నట్లు కనిపించడంతో అతడి భార్య చుట్టుపక్కల వారిని పిలిచింది. ప్రైవేట్ వైద్యుడిని పిలిచిపించి చూపించగా అప్పటికే మల్లేష్ మృతి చెందినట్లు నిర్ధారించాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మల్లేష్‌ది హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మల్లేష్ ముక్కు పైన మాత్రమే గాయం ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ‘ఆదర్శ’లో ఇంటర్మీడియట్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 20వ తేదీ వరకు గడువు
- ఉమ్మడి జిల్లాలో 31 ఆదర్శ పాఠశాలలు
- ఒక్కో పాఠశాలకు 160 సీట్లు



కేతేపల్లి మండలం కొర్లపహాడ్‌లోని ఆదర్శ పాఠశాల

**కేతేపల్లి, తిరుమలగిరి:** ఇంటర్మీడియట్ ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు ఓ వరం. విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పిస్తుండటంతో ఆదర్శ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

**ఉమ్మడి జిల్లాలో 31 పాఠశాలలు**

ఉమ్మడి జిల్లాలో 31 ఆదర్శ పాఠశాలలు ఉండగా.. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో మాత్రమే ఆదర్శ పాఠశాల ఉంది. ప్రతి పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున 160 సీట్లు భర్తీ చేస్తారు. ఈ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు బోధిస్తారు.

**ఎంపిక ప్రక్రియ ఇలా...**

పదో తరగతిలో వచ్చిన మార్కులతో పాటు రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఎంపిక చేయనున్నారు. అల్పాదాయ వర్గాల వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఈ నెల 26న దరఖాస్తులను పరిశీలించి ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఎంపికైన విద్యార్థుల విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించి ప్రవేశాలు కల్పించనున్నారు. జూన్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఇంటర్మీడియట్ సిలబస్‌తో పాటు ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్ కూడా ఇస్తారు.

**బాలికలకు హాస్టల్ సౌకర్యం**

ఆదర్శ పాఠశాలలో చదివే బాలికలకు హాస్టల్ వసతి ఉంది. 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ చదువుతున్న 100 మందికే ఈ అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్లు, ఆపై దూరంగా ఉండే గ్రామాల నుంచి వచ్చే వారు మాత్రమే హాస్టళ్లలో ఉండేందుకు అర్హులు. వీరి కోసం ప్రత్యేకంగా కేర్ టేకర్, నర్సును నియమించారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఫీజులు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా విద్యనందిస్తుంది. క్రమశిక్షణతో పాటు అనుభవం కలిగిన అధ్యాపకులతో నాణ్యమైన బోధన ఉంటుంది. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మమత, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, కొర్లపహాడ్

# త్యాగానికి తగిన ఫలితం దక్కింది

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



అద్దంకి దయాకర్‌ను సన్మానిస్తున్న నెమ్మికల్ గ్రామస్తులు

**ఆత్మకూర్(ఎస్):** ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేస్తే ఏదో ఒక రోజు పార్టీ తనను గుర్తిస్తుందని భావించానని, అనుకున్నట్లుగానే తనకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ఆదివారం తన స్వగ్రామమైన ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో అద్దంకి దయాకర్ పాల్గొని మాట్లాడారు. తనను ఉన్నత పదవిలో చూడాలని 11ఏళ్లుగా ఎందరో ఆశతో ఎదురు చూశారని, వారి దీవెనలతోనే కాంగ్రెస్ పార్టీ తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి జేఏసీ నుంచి కాంగ్రెస్ పార్టీకి వచ్చాక పార్టీ తన స్థాయికి మించి బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. తన అభివృద్ధికి, ఉన్నతికి సహకారం అందించిన శ్రేయోభిలాషులను అన్నివిధాలుగా ఆదుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం పాదాలకు పాలాభిషేకం చేశారు. క్రీస్తు రాజు దేవాలయంలో ఫాదర్ అలెగ్జాండర్‌చే దీవెనలు తీసుకున్నారు. మనం ఫౌండేషన్ గంపల కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామాజిక సేవా జేఏసీ చైర్మన్ భూపతి రాములు, గంపల నారాయణ, జానకిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల వెంకన్న, యాదగిరి, గరిగంటి ప్రకాశ్, గంపల లింగయ్య, సైదులు, నిమ్మ ఎల్లయ్య, వార్డెన్ లింగయ్య, కొంపల్లి మల్లారెడ్డి, గుంటూరు చిట్టిబాబు, రామకృష్ణ, గంగరబోయిన శ్రీను, గురుస్వామి, జలగం మల్లేశ్, కాటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

- నాలుగు గ్రాముల బంగారం, 10 తులాల వెండి అపహరణ

**నేరేడుచర్ల:** తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చోరీకి పాల్పడి బంగారం, వెండి, నగదు అపహరించారు. ఈ ఘటన ఆదివారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాములునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ స్థానిక పశు వైద్యశాలలో అంటెండర్‌గా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇస్మాయిల్ భార్య నాలుగు రోజుల క్రితం మిర్యాలగూడలో తన పుట్టింటికి వెళ్లింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఇస్మాయిల్ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి రాగా.. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని రూ.15వేల నగదు, 10 తులాల వెండి, 4 గ్రాములు బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే నేరేడుచర్ల పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఐదు దశాబ్దాల ‘అపూర్వ’ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**నల్లగొండ టౌన్:** నల్లగొండలోని ప్రభుత్వ మల్టీపర్పస్ హైస్కూల్‌లో 1971లో 12వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఓ హోటల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. 55ఏళ్ల తర్వాత ఒకేచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మంచుకొండ ప్రకాశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకన్న, వినోద్‌తో పాటు 81మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఇక నుంచి ప్రతి ఏడాది పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకుంటామని తెలిపారు.

### భువనగిరి బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**భువనగిరిటౌన్:** భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి బస్టాండ్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తి(సుమారు 38 ఏళ్లు) ఆదివారం ఉదయం హైదరాబాద్ ప్లాట్‌ఫాం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన ఆర్టీసీ అధికారులు పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. బస్టాండ్‌కు చేరుకున్న పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిని పరిశీలించగా.. అతడు మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ప్రాజెక్టు అధికారుల విధులకు ఆటంకం!

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- రాజకీయ నేత ఫోన్ కాల్‌తో ఫిర్యాదు వెనక్కి తీసుకున్న అధికారులు

**చిట్యాల:** బ్రాహ్మణవెల్లెంల – ఉదయ సముద్రం ప్రాజెక్టు సమీపంలో ఇంజనీరింగ్ అధికారుల విధులకు ఆటంకం కల్గించటంతో పాటు వారిపై నేరడ గ్రామస్తులు పలువురు దాడి చేసి దుర్భాషలాడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఉదయ సముద్రం ప్రాజెక్టు ద్వారా డి–1 కెనాల్ వద్ద నుంచి అప్పాజిపేట, దోమలపల్లి తదితర గ్రామాలకు నీటి తరలించేందుకు వంతెన నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డి–1 కెనాల్ వద్ద ప్రాజెక్టు ద్వారా నీటిని మళ్లింపు చేపట్టారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న నేరడ గ్రామానికి చెందిన పలువురు తమ గ్రామానికి వచ్చే నీటిని ఎందుకు రానీయకుండా అడ్డుకుంటున్నారని ఇంజనీరింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. డీఈ కాలర్ పట్టుకుని ఈడ్చుకెళ్లి దుర్భాషలాడినట్లు తెలిసింది. దీంతో డీఈతో పాటు ఏఈ నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చెప్పగా.. జరిగిన ఘటన చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని పోలీసులు తెలిపారు. దీంతో అధికారులు చిట్యాల పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ అధికారికి నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేత నుంచి ఫోన్ కాల్ రావటంతో ఫిర్యాదు వెనక్కి తీసుకుని వెళ్లిపోయారు. ఈ విషయంపై చిట్యాల ఎస్‌ఐ ధర్మాను వివరణ కోరగా.. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

### వీఓఏ ఆచూకీ లభ్యం

**యాదగిరిగుట్ట రూరల్:** యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో వీఓఏగా విధులు నిర్వహిస్తున్న మిట్ట సంధ్య ఆచూకీ ఆదివారం తెలిసింది. అధికార పార్టీ నాయకులు వేధిస్తున్నారని నోట్ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంధ్య తన స్కూటీని ఆలేరు బస్టాండ్‌లో పార్కింగ్ చేసి హైదరాబాద్‌కు వెళ్లింది. హైదారాబాద్‌లోని చర్లపల్లి పరిధిలో తన చెల్లెలి ఇంటి వద్ద ఉనట్లు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా గుర్తించి.. ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

# సైన్యం పిలిస్తే వెళ్లడానికి సిద్ధం

- దేశ సేవ చేసే అదృష్టం అందరికీ రాదు
- మాజీ సైనికులు నర్సింగ్ మార్క్, లక్క లింగారెడ్డి

‘ఆపరేషన్ సిందూర్‌తో భారత జవాన్లు గట్టిగా పోరాడుతున్నారు. ఎప్పుడు యుద్ధం జరిగినా సైన్యం పిలిస్తే వెళ్లడానికి సిద్ధంగా ఉంటాం. దేశరక్షణ కోసం ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఎదురుచూస్తుంటాం. దేశానికి సేవ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావించాం. అది అందరికీ రాదని చెబుతున్నారు’ మాజీ సైనికులు నర్సింగ్ మార్క్, లక్క లింగారెడ్డి. ఇండియా – పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో వారు ‘సాక్షి’తో మాట్లాడారు.

**పాకిస్తాన్‌తో తాడో పేడో తేల్చుకోవాలి**

– నర్సింగ్ మార్క్, మాజీ సైనికుడు



**నల్లగొండ :** పాకిస్తాన్ మొదటి నుంచి కవ్వింపు చర్యలకు పాల్పడటం భారత దళాలు వారికి బుద్ధి చెప్పడం, తోక ముడిచి వెనుదిరగడం పాకిస్తాన్‌కు అలవాటే. పాకిస్తాన్‌తో ఇప్పటికైనా తాడోపేడో తేల్చుకోవాలని అంటున్నారు మాజీ సైనికుడు, సెక్షన్ కమాండర్ నర్సింగ్ మార్క్. తిప్పర్తి మండలం జొన్నగడ్డలగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ మార్క్ 1984లో ఆర్మీలోకి వెళ్లారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో ఆర్మీ శిక్షణ పూర్తిచేసుకుని జమ్ముకశ్మీర్, పంజాబ్, మధ్యప్రదేశ్, హైదరాబాద్, నేపాల్, కేరళ తదితర ప్రాంతాల్లో పని పని చేశారు. 2004లో రిటైర్ అయ్యారు.

**శత్రువు మీద గురి పెట్టడమే లక్ష్యం..**

చేతిలో తుపాకి ఎదురుగా ఉన్న శత్రువు మీద గురిపెట్టడం ఒకటే లక్ష్యంగా సైనికులు పోరాడుతారు. సైనికుడు లక్ష్యాన్ని చేధించడం కోసం ప్రాణాలను కూడా లెక్క చేయడు. పోరాడి వీరమరణం పొందుతాడే తప్ప శత్రువు చేతికి చిక్కే పరిస్థితి తెచ్చుకోరు. ఒకవేళ ఆ పరిస్థితి వస్తే యుద్ధంలో ‘జవాన్‌కు ఆఖరి గోలి ఆఖరి దుష్మన్’ అనే విధానం ఆఖరి తూటాతో శత్రువును నాశనం చేయడం.. అవకాశం లేకపోతే శత్రువుల చేతిలో చంపకుండా తనకు తానే కాల్చుకుని వీరమరణం పొందుతాడు తప్ప వెన్ను చూపడు. ఆ విధంగా ప్రతి సైనికుడు యుద్ధంలో పోరాడుతాడు.

**కార్గిల్ యుద్ధంలో సెక్షన్ కమాండర్‌గా పని చేశా..**

1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో నేను సెక్షన్ కమాండర్‌గా పని చేశా. హిమాలయాల్లో టైగర్ హిల్స్‌పై ఆరు నెలలు ఉన్నాం. మంచు పర్వత మిది. మంచినీళ్లు కూడా ఉండవు. మంచుని కరిగించుకుని తాగాలి. వంట చేసుకోవాలన్న అక్కడ ఉన్న మంచుగడ్డలను గిన్నెలో వేసి నీరుగా మార్చిన తర్వాతే వంట చేసుకోవాలి. ఒక్కోసారి తిండి లేకున్నా యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ టైగర్ హిల్స్‌పై పైకి ఒకసారి వెళ్లామంటే ఆరు నెలలకు అవసరమైన అన్ని అహార పదార్థాలు, మెడిసిన్ తీసుకెళ్లాలి. అత్యవసరమైతే పైనుంచి హెలికాప్టర్‌లో వచ్చి పైనుంచి కిందకు వదులుతారు. సమాచార వ్యవస్థ కూడా అసలు ఉండదు. కార్గిల్ యుద్ధంలో శత్రువులు మా వైపు రాకుండా ముందే మైన్ ఎం14, ఎం16లను భూమిలో పాతిపెట్టేవాళ్లం. వెంట్రుక లాంటి వైర్లను అమర్చాం. అయితే శత్రువులు అటుగా ఆ మైన్లను దాటి వస్తే ఆ వైర్‌కు కాలు తగిలినా.. మైన్ మీద కాలు పెట్టినా అది పేలిపోతుంది. అలా శత్రువుల ఆట కట్టించే వాళ్లం.

**మళ్లీ పిలిస్తే వెళ్లేందుకు సిద్ధం**

పాకిస్తాన్‌తో మళ్లీ యుద్ధం జరిగిన సమయంలో.. నన్ను పిలిస్తే వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా. నేను ట్రెయిన్డ్ జవాన్‌ను. ఎప్పుడైనా దేశం రక్షణ కోసం జరిగే యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉంటాను. మాతో పాటు చాలా మంది మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నారు.

**దేశసేవ చేయడం అదృష్టం**

– లక్క లింగారెడ్డి, మాజీ సైనికుడు



**పెద్దవూర :** దేశానికి సేవ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావించాలి. అది అందరికీ రాదు అని చెబుతున్నారు ఇండియన్ ఆర్మీలో 19 ఏళ్ల పాటు దేశానికి సేవ చేసి పదవీ విరమణ పొందిన లక్క లింగారెడ్డి. పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన లింగారెడ్డి. తల్లిదండ్రులకు ఒక్క కుమారుడు. ఆర్మీలో చేరవద్దని తల్లిదండ్రులు ఎంత వద్దని వారించినా దేశానికి సేవ చేయాలన్న తలంపుతో 2003లో ఆర్మీలో చేరారు. 2022 డిసెంబర్‌లో రిటైర్ అయ్యారు.

**19 ఏళ్లు సైన్యంలో పనిచేశా..**

ఆర్మీ ఎయిర్ డిఫెన్స్(ఏఏడీ)లో ట్రైనింగ్ చేసి 47 ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్‌లో పోస్టింగ్‌కు వెళ్లా. తన సర్వీసులో ఆరున్నర సంవత్సరాలు జమ్మూ కశ్మీర్‌లో పనిచేశా. మూడు సంవత్సరాలు ఉగ్రవాదులను ఏరివేసే స్పెషల్ బెటాలియన్ రాష్ట్రీయ రైఫిల్స్(25 రాష్ట్రీయ రైఫిల్స్)లో పనిచేశా. ఆ సమయంలో ఎన్నో ఆపరేషన్లలో పాల్గొన్నా. 19ఏళ్లు సైన్యంలో పని చేసి పదవీ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన సమయంలో గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులు రెండు కిలోమీటర్ల వరకు ఎదురొచ్చి కుంకుమ దిద్ది, హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. రెండు కిలోమీటర్లు పూలు చల్లుతూ బాణాసంచా కాల్చుతూ, నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఆ అనుభూతిని నేను జీవితంలో మరిచిపోలేను. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియన్ ఆర్మీ ధైర్యంగా, వీరోచితంగా, సాంకేతికతతో పోరాడుతోంది. యుద్ధం వల్ల దేశానికి కొంత నష్టం జరిగినా భవిష్యత్‌లో ఉగ్రవాద సంఘటనలు జరగకుండా ఉంటాయి. యుద్ధ సమయంలో తన అవసరం ఉందని సైన్యం పిలిస్తే వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా. ఎప్పుడు కాల్ వస్తుందా అని ఎదురుచూస్తున్నా.

# గోమాత.. జాతీయ జెండాలతో గిరి ప్రదక్షిణ





గో మాతతో గిరి ప్రదక్షిణ చేస్తున్న ఈఓ వెంకట్రావ్, భక్తులు

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని ఆలయ కొండ చుట్టు ఆదివారం భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. శ్రీస్వామి వారి జయంతి సందర్భంగా అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గో రక్షణ, భూ రక్షణ, పర్యావరణ రక్షణ, ధర్మం కోసం అంటూ గోసేవ ఫౌండేషన్ నిర్వాహకులు గోమాతతో పాటు జాతీయ జెండాలు, కాషాయం జెండాలతో భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. 5వేలకు పైగా భక్తులు ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు మెట్ల దారి మార్గంలో వెళ్లి శ్రీస్వామిని దర్శించుకున్నారు. ఈ గిరి ప్రదక్షిణలో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఎ.శరత్, ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



### ఈఏపీసెట్‌లో ‘శ్రీచైతన్య’ ప్రభంజనం

**ఖమ్మం సహకారనగర్:** ఈఏపీసెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదివారం అభినందించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో వి. కుషాల్ 28వ ర్యాంకు, వై. నిషాంత్ 61, డి. దుర్గా గుజిరి 222, ఏ. సాయితేజ 253, కె. విశావని వాగ్దేవి 301, బి. రిషిత 321, ఆర్. జోష్టవ్ కుమార్ 334, కె. సాయిదివ్య వర్షిత 423, జి. సాయి ప్రణవి 491, కె. హాసిని 575, వి. ప్రణతి, కె.తేజస్విని 653, బి. ఈశ్వర్ గుప్తా 855, యు. వశిష్ఠ 908, బి. మనీశేషు 968, డి. శ్రీలేఖ 1195, పి. స్మైలికరెడ్డి 1262, కె. నిషాంత్‌రెడ్డి 1394, ఎల్. మనోహర్ 1422, జి. అలేఖ్య 1482వ ర్యాంకు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, డీజీఎం సీహెచ్. చేతన్ మాథుర్, ఎగ్జిక్యూటివ్ డీన్ ఎన్ఆర్ఎస్‌డీ వర్మ, డీఎస్ జె. కృష్ణ, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

### జయ విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయ వేణుగోపాల్

**సూర్యాపేటటౌన్:** ఈఏపీసెట్ ఫలితాల్లో సూర్యాపేటలోని జయ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం వెలువడిన ఎప్‌సెట్ ఫలితాల్లో కళాశాలకు చెందిన కె. ఉజ్వన్ 141వ ర్యాంకు, జి. తేజశ్రీ 266, సీహెచ్. హన్షితశ్రీ 695, టి. అమూల్య 913, బి. లాస్య 917, పి. అమిత్‌సూర్య 1948, బి. శివమణి 2270, డి. జగదీష్ రాజు 2935, వై. ప్రదీప్ 3364, కె. సాయినందన్ 3977, జి. నవదీప్‌రెడ్డి 4003, సీహెచ్. కుశల్ రాజు 5044, సీహెచ్. అక్షయ భారతి 5583, కె. యామిని 5823, ఎం. హన్సిని 5843, వి. బిందుమాధవి 6002, ఎస్. నక్షత్ర 6630, కె. పవన్ కుమార్ 7280, జి. సాయిరాం 8325, ఆర్. ప్రియదర్శిని 8328, ఎం. సాద్విక 8361, సీహెచ్. వైశాలిని 8449, జె. కీర్తన 8989, ఎ. కిషోర్ 9502 ర్యాంకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు అధ్యాపకులను ప్రిన్సిపాల్, కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

### ఉగ్రవాదానికి పాకిస్తాన్ స్వస్తి పలకాలి

**అర్వపల్లి:** ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్తాన్ పూర్తిగా స్వస్తి పలకాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ ర్సింహస్వామి దేవాలయాన్ని ఆదివారం సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్తాన్ పుట్టినిల్లుగా మారిందన్నారు. పాకిస్తాన్‌తో సోమవారం జరిపే చర్చల్లో ఉగ్రవాద నిర్మూలనకు ఏమి చర్యలు చేపడతారో తెలియజేయాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాకిస్తాన్‌లో ఉగ్రవాద నిర్మూలనపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్రం చేపట్టే ఉగ్రవాద నిర్మూలన చర్యలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ, దేవస్థాన చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

# శాటిలైట్ టోల్ వసూలు ఇప్పట్లో లేనట్లే..



విజయవాడ-హైదరాబాద్ హైవేపై చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద టోల్‌ప్లాజా

- నావిగేషన్ ఉపగ్రహాలు అందుబాటులోకి వచ్చే వరకు వాయిదా
- పూర్తిస్థాయిలో అభివృద్ధికాని ఐఆర్ఎన్ఎస్ఎస్ టెక్నాలజీ

**చౌటుప్పల్ రూరల్:** జాతీయ రహదారులపై టోల్ వసూలుకు శాటిలైట్ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రక్రియ మరింత ఆలస్యం జరిగే అవకాశాలు ఉన్నాయి. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు మే 1వ తేదీ నుంచి అమలు చేస్తారని మొదట్లో అనుకున్నప్పటికీ.. ప్రస్తుతానికి ఈ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. టోల్ వసూలుకు కచ్చితమైన సొంత నావిగేషన్ ఉపగ్రహాలు మరిన్ని అందుబాటులోకి వచ్చే వరకు ఈ ప్రక్రియ జాప్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులు వెల్లడించారు. జీపీఎస్ విధానానికి ప్రత్యామ్నాయంగా ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(ఐఆర్ఎన్ఎస్ఎస్)ను సొంతంగా రూపొందించింది. అయితే ఈ టెక్నాలజీని ఇస్రో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన తర్వాతే శాటిలైట్ విధానంలో టోల్ వసూలు చేసేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ వ్యవస్థను మొదటగా దేశ రాజధాని ఢిల్లీలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఈ ఏడాది ఆగస్టు నుంచి పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నారు. అక్కడ ఈ విధానం విజయవంతంగా అమలు జరిగిన తర్వాత దేశంలోని జాతీయ రహదారుల అన్నింటికి అమలు చేయనున్నారు. మొదటగా భారీ వాహనాలకు శాటిలైట్ టోల్ వసూలు విధానం అమలు చేసి తర్వాత కార్లు, మిగతా వాహనాలకు ఈ విధానం అమలు చేయనున్నట్లు తెలిసింది. 2027 నుండి అన్నిరకాల వాహనాలకు శాటిలైట్ విధానం అమలు చేయనున్నారు. ఈ విధానం అమలు కోసం ఫాస్టాగ్ స్థానంలో నావిగేషన్ చిప్‌ను వాహనాలకు బిగించనున్నారు. కార్లకు ఈ చిప్ జీపీఎస్ కోసం రూ.4వేల వరకు ఖర్చయ్యే అవకాశాలు ఉన్నాయని ఫాస్టాగ్ ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.